



## రచన : శ్రీ. నేమాని సూర్యారావు

[కోటిస్వదేశంలోని మానవులను దరిద్రులుగాచేసి. తామే యీ ప్రపంచమంతటికి ఛత్రంలేనిరాజులని విర్రవీగే యీ జమీందార్ల కర్కశహృదయాలపై సమ్మెటదెబ్బలు ఎప్పుడో కదా? ఏనాడైతే, దయారహితులైన యీ ధనవంతులు సంపూర్ణంగా నశించిపోతారో—ఆనాడే, పట్టెడన్నం లేక, మల, మల మాడే దరిద్రప్రజానీకం దీపావళి చేసుకొంటుందికదూ!!

యిదికేవలం కల్పితంకాదు. కోటిదరిద్ర సోదరులను కన్నెత్తిచూడని యీ పెద్దలైన ధనవంతులు, జూదపుశాలలలో వీరుచేసే అనవసరవ్యయం,—నా కళ్లతో చూచిన, నామట్టుకు నాకు—చాలావిచారం కలిగింది...యీ నగ్నసత్యాన్నే ఈ రచన వెల్లడిచేస్తోంది. రచయిత.]

❀

అప్పటికి అయిదారు రోజుల నుండి క్షుద్బాధకు తాళలేక అంతవరకూ అరచి అలసి, అలసి, జీర్ణించి, ఒకదాని కొకటి పెనవేసుకుపోయిన ఆకలి ప్రేవులు ఒక్కసారిగా వికసించాయి. ఆవ్యక్తిని చూచిన తోడనే. అది ఒకయిల్లు...రంగు రంగుల పుష్పరాజములతో అలరాడు చుండిన సుందరపూలవనం ఆయింటికి ఓవింత శోభను ఇచ్చింది. వూరులోని దానిని మించిన సౌధము లేదనియే చెప్పవచ్చు. అంతటి వున్నత సౌధమున ముందు గేటులో నుండి, యింటి యజమాని వీధి వైపుకు చూచు చున్నాడు. నాలోని నిబిడీకృత అధికారం అంతా ఒక్కసారి ఆకశములోని మెరుపు వలె తళ తళ మంది ఆకలిజ్వాలకు ఆహుతైన నేత్రద్వయ తేజం ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది. నిరాశాసముద్రములో కొట్టుకు పోయే పక్షికి ఆధారం దొరకింది కదాయని నిర్బలమైన కాళ్ళకు కొంచెం చురుకుగా పనిచెప్పి, దగ్గరగా నడిచా. ఆశా హృదయాన్ని విప్పి దూరము నుండి నన్ను చూచిన ఆమహాశయుడు మందహాసం చేసి, ఠీవిగా నిలబడ్డాడు. దగ్గరకు పోయిన నేను చేతులు చాస్తూ,

"అయ్యా!" అనిఅర్థిస్తూ ఒక్కసారి తన ఫేసు పౌడరు ముఖాన్ని నావైపుకు త్రిప్పి,—యీనరాల అస్థి పంజరాన్ని పైనుంచి క్రింది వరకూ తిలకించగా..... శుష్కించి పోయిన యీనా నరాల నుండి ఆరి పోయిన రక్తపు బిందువులు-ఎండిపోయి

ఎక్కడో మిగిలియున్న మాంసపు కండల చాటుకు పోయి దాక్కుంటున్నాయి.

పైగా మిణుగురుపురుగువలె. మిల్కు మిల్కు మంటూ, జీర్ణించగా మిగిలిన కొద్ది జీవ కణాలు బక్కచిక్కి బలహీనతతో హీనంగా మూలుగుతున్న గుండె వైపుచేరి, తన గౌరవ మర్యాదలను కాపాడుకొనడం కోసం సాయశక్తులా తాపత్రయం పడుతున్నాయి.

పాపం! యీ నానగ్న దృశ్యాన్ని కళ్ళారాచూచిన ఆమహాశయుని హృదయం పాషాణ మగుటవల్ల కాబోలు, "ఛో, ఛో, యిక్కడేమీ లేదు, మీ బాబు మూట" అని నిర్దాక్షిణ్యంగా, కఠోర వాక్కు నొక దానిని, యీనిర్భాగ్యునిపై విసరి వెనుదిరిగి ఒక్కమారు రెండు తలుపు చక్కలూ బడాలుమని వేసి, తన గౌరవానికి కళంకం లేకుండా చేసుకొన్నాడా ధనవంతుడు.

యీయదార్థ దృశ్యాన్ని చూచిన నాకండ్లు చమ్మగిల్లాయి. హృదయ భారం ఎక్కువయింది. కాళ్ళు వణికాయి, శరీరం ముచ్చెమటలతో నిండి పోయింది. ఆవేశం అమితమయింది, ఒక్కనిమిషం అలా జారబడిపోయా...స్వప్నంలో......మిల్లు యజమాని యైన యీ ధనవంతుడు, శ్రామిక జీవులపై చెలాయించే అధికారం కష్టజీవుల


# మనోహరన్ స్టోర్స్

తంతి : "హరన్ టాకీ"

181 ఈస్టు గేట్
మధుర

టెలిఫోన్ : 519

మోహన్ రామ్ కంపెనీవారి చీరలు పంచలు,

★

యన్. కె. సి. సింహంమార్కు బనియన్లు, స్లిప్పోవర్లు, అండర్వేర్లు మొదలైనవి.

★

మద్రాసు ఇండో లంకా ట్రేడర్సువారి
44" డోరియా వాయిల్సు, 30" డోరియా వాయిల్సు,
(అందమైన చేనేతబట్టలు) చక్కని డిజైన్లలో మావద్ద దొరకును.

★

టోకు వ్యాపారస్థులు చిల్లర వర్తకులు కూడా వివరములకు వ్రాయండి.

చెమట బిందువులన్నీ చేరదీసి, ఘనీభవింపజేసి, ఇనుప పెట్టెలుగా తయారు చేసేవిధం శ్రమిక జీవుల ఎముకలను, నరాలను, కూడదీసి, నాణెములను జేసి, బాధా జీవుల రక్తములో ముంచి, కాసులను జేసేరీతి – పునాదులతో సహితమూ, కూలిజీవుల ఎముకలనెడి యిటుకలను, పేదార్తుల రుధిర వాహినులను సున్నములో ముంచి, పెద్ద కట్టడములు కట్టి, కడుపులోని చల్ల కదలకుండా హంసతూలికా తల్పాలపై వూగిస లాడే యీ ధనవంతుల ఆనందం–అన్నీ ఒక్కసారి కళ్ళకు కట్టినట్లు అయింది.

నాకు తెలియకుండానే నాకళ్లు తెరవబడ్డాయి. ప్రక్కకు చూసా. ఓకుక్క నాకాళ్ళను ప్రేమతో నాకుతోంది...నాలో ఆశ్చర్యం రేకెత్తింది. ఏమిటో విచిత్రం! యీ కుక్కకున్న ప్రేమ, యీ జమీందారుకు లేదే? తోటి సోదర మానవుడు, భీకర ఆకలి దేవతకు గురి అవుతూంటే, పెట్టడం లేదు సరికదా, చూచి విచారించడమైననూ లేదే యిది ఎక్కడి మానవ ప్రపంచం! నోరు లేని కుక్కకున్న ప్రేమ, ఆదరమూ, మానవ మాత్రులైన వీళ్లకు లేవా? వీళ్లు నిజంగా మనుష్యులు కారు.

మానవులను పీల్చి పిప్పి చేసే మానవ్యరూప రాక్షసులు కాబోలు! ఒక్క దీర్ఘ నిట్టూర్పు విడచి బయలు దేరా, బాధాజీవుల ఆర్తనాదా లోకానికి, నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ.

అది పట్టణానికి మధ్య నున్న బహిరంగ స్థలంలో క్రొత్తగా వేసిన "హాలీవుడ్ సిటీ" అనే విదేశపు జూదపు శాల. విరగబడి నేల యీనినట్లు జనం త్రొక్కిస లాడుతున్నారు...అక్కడికి చేరితే ఏ దయామయు డైనా నాఆకలి మంటను చల్లార్చలేడా? అని అక్కడ గేటు ముందర నిలబడి వచ్చి పోయే వాళ్లను, దీన దృక్కులతో– "బాబూ! తిండి తిని మూడు, నాలుగు, రోజులయింది బాబు. ఆకలి దహించుకు పోతూంది. యీ పొట్ట చూడండి ఎలా వెనక్కు పోయి ప్రేవులకు అంటుకు పోయిందో. ఒక్క కానీబాబు. మీచేతి గుండా ఒక్క రాగి పైసా...ధర్మం చేయండి తండ్రీ నాజన్మలో మీపేరు మరచి పోను."

అని ఎంత మొత్తుకున్నా లాభంలేక పోయింది. కడుపు మంట ఎక్కువయింది. లోపలనుండి వచ్చేవారిని తదేక దృష్టితో చూసా. నాకే ఆశ్చర్యం వేసింది. వెళ్లేటప్పుడున్న సంతోషానందం ముఖాలపై వచ్చేటప్పుడు మాయమైవున్నది డబ్బుతగలడింది కదా! యని ఏడుస్తూ రావడం పరిపాటయినది. అందరూ అంతే...యిక...అక్కడ నేను, ఎవర్ని, ఏమని, అడగను? ...అంచేత తిరుగు ముఖంపట్టా...దారిలో...నా హృదయం...బయట, తిండి తిప్పలు లేక అఘోరిస్తూ, బాధ పడుతున్న సోదరుని ఆకలి జ్వాలను చల్లార్చలేక, అంటే ఒక్క కానిడబ్బు యివ్వలేని ఆచేతులు లోపలికి పోయి, జూదంలో – పదులు, ఏభైలు, తగలబెట్టి వెఱ్ఱి మొహాలు వేసుకొని బయటకు వస్తూ వుంటారే! ప్రపంచం యిక ఏవిధంగా బాగు పడుతుందిరా భగవాన్!

తోటి మానవుల కన్నీటిని చూచి కూడా తన విద్యుక్త ధర్మాన్ని విస్మరించి ఎందుకూ కొరగాని, ఆపాశ్చాత్య జూదపు గాళ్ళకు, తమడబ్బును చదివించి, వెనక్కు చక్కారావడం మన సోదరులకు అలవాటుకదా !...అని ఎలుగెత్తి అరస్తూ వుంది నా యీచిన్న హృదయం.

అవి అంత వరకూ ఆగర్భ దరిద్రుని హృదయంలో నుండి ఊడిపడ్డ ఆమాటలు విన్న నాకు, కళ్ళ వెంబడి వేడికన్నీటి ధారలు రెండు – నారెండు చేతుల మీదా అప్రయత్నంగా పడ్డాయి. వులిక్కి పడ్డా. అంత వరకూ, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ క్రిందకు దించుకొనివింటూవున్న నాముఖాన్ని ఒక్కసారి పైకెత్తా...పాపమూ! నిర్భాగ్యుని ముఖం కందిపోయి వాపోవ నారంభించింది. ప్రక్క నున్న నామనస్సు వికలమయింది.

రోడ్డుకడ్డంగా చైతన్యం లేక పడి వున్న యీ అనాధను లేవదీసి, వుపచర్యల చేసి, సేదదీర్చి, యిలా కూర్చుండ బెట్టి, యీ దరిద్రుని జీవిత చరిత్రను యింతవరకు విన్న నాకు కూడా రెండు బిందువులు నేల పడ్డాయి...అంతే...యీ నిస్సహాయానికి యింతకంటే నేను మాత్రము ఏమి చేయ్యగలను ?


# ప్రకటన

విజయనగరము, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు మా రెడీమేడ్ డ్రెస్సులను విక్రయించుటకు, విజయనగరములో శ్రీ సిహెచ్. సాంబశివరావుగారిని, ఏజంటుగా నియమించియున్నామని సంతోషముతో తెలియపరచుచున్నాము.

## ధనలక్ష్మి స్టోర్స్

రెడీమేడ్ డ్రెస్ మ్యానుఫేక్చరర్స్,

మధుర.